## ః ధనుర్మాసోత్సవమ్ ః శ్రీ ఆండాళ్ శ్రీవ్రత సంకీర్తనలు ః

ః రచన : శ్రీమతి తెలికిచర్ల కందిడై సీతమ్మ గారు – 08.01.2022 ః

ః సంగీతం : శ్రీ గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్, ఆస్థాన విద్వాంసులు, తి.తి.దే. ః

ః గానం : శ్రీమతి జి. లావణ్య బృందం, శ్రీ అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు, తి.తి.దే. ః

**01.** పల్లవి : మా శ్యామ సుందరా । జయ మంగళం । శుభ మంగళం ।
వాసవామర పుంగవులు కడు గాసినొంది నినున్ నుతింపగ ।
వాసి ముల్లోకములు కొలిచిన భాసమాన చరణములకు ॥
॥ మా శ్యామ సుందరా ॥

**02.** చరణం : వారిధిని బంధించి వానర వీరులతో లంకకును చేరి ।
వైరులగు రాక్షసుల ద్రుంచిన బహు బలమునకు ।
మేర మీరిన శౌర్య మొప్పగ మిగుల చిన్న తనంబునందె ।
క్రూర శకటాసురు వధించిన కీర్తి కెప్పుడు మంగళమ్ము ॥
॥ మా శ్యామ సుందరా ॥

**03.** చరణం : గురుతరంబగు పర్వతంబును గొడుగు వలె పైకెత్తి నట్టి ।
వరద నీదగు కరుణకును వేమారు మంగళము ।
దురిత వత్సాసురుని బట్టి గిరగిరామని త్రిప్పి వెలగ ।
తరువుపై విసిరేయు కుంచిత చరణములకు మంగళమ్ము ॥
॥ మా శ్యామ సుందరా ॥

**04.** చరణం : అరుల నిరసనమును నొనర్చుచు శౌరిదేవర వారి చేతను ।
కరము మెఱసెడి ఆయుధమునకు కలుగు మంగళము ।
సురుచిరంబగు నీ పరాక్రమ గరిమ బొగడుచు పురుషార్థము ।
కొరతదీర లభించుటకునై కుతుకమలరగ వచ్చినాము ॥
॥ మా శ్యామ సుందరా ॥

**05.** చరణం : బంధువులచే చాలాకాలము బహుళ కష్టము నొందినాము ।
సందడులు విడివారె ఇప్పుడు సమ్మతించిరి వేగరమ్మా ।
మందహాస వదనారవిందమున మము కటాక్షించిన ।
అద్వితీయంబైన మా వ్రతమానందముగా ఫలించును ॥
॥ మా శ్యామ సుందరా ॥

- - -